నిరుద్యోగ భృతి కోసం నిరీక్షణ

- 2014 ఎన్నికల్లో హామీ ఇచ్చినా అమలు చేయని చంద్రబాబు
- మళ్లీ 2024 ఎన్నికల్లో మరోసారి ఇదే హామీతో అధికారంలోకి..
- ఈసారైనా అమలు చేయాలంటూ నిరుద్యోగుల వేడుకోలు
- భీమవరం నియోజకవర్గంలో 70 వేల మంది నిరుద్యోగులు



భీమవరం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చి నెల గడిచిపోయింది. ఎన్నికల సమయం లో టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ ప్రజలకిచ్చిన హామీల అమలు మాట పక్కనపెట్టి శ్వేతపత్రాలంటూ హడావిడిస్తుండడంతో తమకిచ్చిన హామీల సంగతేమిటంటూ వివిధ వర్గాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రధానంగా ప్రతి ఇంటికీ ఉద్యోగం కల్పిస్తామని, లేకుంటే నిరుద్యోగ భృతి ఇస్తామంటూ ఎన్నికల్లో నమ్మించి ఓట్లు దండుకున్న కూటమి ఇప్పటివరకు నిరుద్యోగ భృతి విధివిధానాలు ప్రకటించకపోవడంతో నిరుద్యోగుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో మాదిరిగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిరుద్యోగులను మోసం చేస్తారేమోనని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భీమవరం నియోజక వర్గంలోని భీమవరం పట్టణం, వీరవాసరం, భీమవరం మండలాల్లో సుమారు 70 వేల మంది నిరుద్యోగులు ఉన్నట్లు అంచనా. వీరంతా టెన్త్ పైబడి పీజీ, ఇంజనీరింగ్ వంటి ఉన్నత విద్యనభ్యసించినవారే కావడం విశేషం. వీరిలో అనేక మంది వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతుండగా, అందుకు అవసరమైన పుస్తకాలు, కోచింగ్ సెంటర్లకు చెల్లించే ఫీజుల కోసం తల్లిదండ్రులపై ఆధారపడుతున్నారు. మరికొంతమంది తమ కుటుంబాలను పోషించుకోవడానికో తల్లిదండ్రులకు ఆసరాగా నిలవడానికో వివిధ రకాల షాపులు, దుకాణాల్లో అరకొర జీతాలకు పనిచేస్తున్నారు. ఇటువంటి వారంతా చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీతో సరైన ఉద్యోగం వస్తుందని ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. ఉద్యోగం వచ్చే వరకు ప్రభుత్వం ఇచ్చే నిరుద్యోగ భృతి పోటీ పరీక్షలకు సన్నద్ధం కావడానికి అసరాగా నిలుస్తుందని భావించామని, అయితే దీనిపై ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడం ఆందోళన కలిస్తోందని వాపోతున్నారు. నిరుద్యోగ భృతిపై చంద్రబాబుతో పాటు పవన్‌కల్యాణ్ కూడా హామీ ఇవ్వడంతో గతంలో మాదిరిగా కాకుండా తప్పక అమలుచేస్తారని ఆశించామని దీనిపై ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్పందించకపోవడం దారుణమంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిరుద్యోగ భృతిని తక్షణం అందించేందుకు ఏర్పాట్లు చేయాలని, అనంతరం ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరుతున్నారు.

నిరుద్యోగ భృతి ప్రస్తావనేది ?



నిరుద్యోగ భృతి ఇస్తానని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఇంత వరకు నిరుద్యోగ భృతి గురించి ప్రస్తావనే లేదు.ఎన్నికల ముందు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత ఇంతవరకు నిరుద్యోగుల గురించి పట్టించుకోకపోవడం దురదృష్టకరం. చంద్రబాబు ప్రభుత్వం తక్షణం హామీని అమలు చేయాలి.

– గుర్రం బెన్హర్, జువ్వలపాలెం, కాళ్ల మండలం

ఎప్పటికి అమలు చేస్తారు?



చంద్రబాబు ప్రభుత్వం నిరుద్యోగ భృతిపై నేటికీ ఒక నిర్ణయం తీసుకోలేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని తుంగలో తొక్కుతారా? నిరుద్యోగుల్ని ఆదుకుంటారా? సీఎంగారూ శ్వేతపత్రం విడుదల చేస్తారా! ఉద్యోగాలు కల్పిస్తామని డీఎస్సీ వేసి నిరుత్సాహపరిచారు. ఏ విధమైన నిబంధన లేకుండా నిరుద్యోగ భృతి అన్నారు. ఎప్పటికి అమలు చేస్తారో ప్రకటించాలి.

– మేరుగ దీనమనస్సు, ఆకివీడు

వెంటనే అమలు చేయాలి



ఎన్నికల్లో ఇచ్చిన నిరుద్యోగ భృతి హామీని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి. నేను భీమవరం పట్టణంలోని సీఎస్ఎన్ కళాశాలలో ఎంఏ పూర్తి చేశాను. ఉద్యోగం లేకపోవడంతో సంపాదన లేక ఆర్థికంగా తల్లిదండ్రులపై ఆధారపడాల్సి వస్తోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీని ప్రభుత్వం తక్షణం అమలు చేస్తే మాలాంటి వారికి ఎంతో ఉపయోగంగా ఉంటుంది.

– పడవల నాని, బాలేపల్లి, వీరవాసరం మండలం

మరోసారి మోసగించొద్దు



2014 ఎన్నికల్లో నిరుద్యోగ భృతి ఇస్తానంటూ ఓట్లు దండుకుని తీరా అధికారంలోకి వచ్చిన హామీ అమలు చేయకుండా చంద్రబాబు ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసింది. ఇప్పుడు మళ్లీ 2019 ఎన్నికల్లో మరోసారి పవన్ కల్యాణ్‌తో కలిసి నిరుద్యోగ భృతి ఇస్తామంటూ మరోసారి అధికారంలోకి వచ్చింది. నిరుద్యోగులను మోసగించకుండా వారికి ఇచ్చిన వాగ్దానాన్ని ఇప్పటికైనా అమలు చేయాలి.

– జి.సుందర్‌కుమార్, నిరుద్యోగి, ఉణుదుర్రు, ఉండి మండలం

క్లుప్తంగా

అప్పారావుకు డాక్టరేట్‌పై హర్షం



అప్పారావుకు అభినందనలు తెలుపుతున్న కేవీపీఎస్ నాయకులు

భీమవరం (ప్రకాశం చౌక్): 'తూర్పుగోదావరి జిల్లా వచన కవిత్వం – ఆర్థిక, రాజకీయ, సామాజిక దృక్పథం' అంశంపై చేసిన పరిశోధనకు గాను గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా అధికారి కేసీహెచ్ అప్పారావుకు డాక్టరేట్ లభించింది. ఈ మేరకు కుప్పంలోని ద్రావిడ విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టాను అందుకున్నారు. ఈ సందర్భంగా భీమవరం కలెక్టరేట్‌లో ఆయనను కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బత్తుల విజయ్‌కుమార్, కె.క్రాంతిబాబు కలిసి అభినందనలు తెలిపారు. కవిత్వంలో కూడా సామాజిక, ఆర్థిక, రాజకీయ కోణాల్లో సమాజాన్ని విశ్లేషించడం గొప్ప విషయం అన్నారు. సమాజంలో జరిగే అన్ని అసమానతలపై తన విజ్ఞానంతో ప్రజలను చైతన్యపరుస్తూ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అలాగే జీఎస్ డబ్ల్యూఎస్– మీ కోసం సిబ్బంది అప్పారావును దుశ్శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

హాస్టళ్లలో వసతులను మెరుగుపరుస్తాం

ఉండి: ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణంరాజు సోమవారం ఉండిలో పర్యటించారు. గ్రామంలోని బీసీ బాయ్స్ హాస్టల్, ఎస్సీ బాలికల హాస్టల్‌ను సందర్శించారు. హాస్టళ్లలో మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు కృషి చేస్తానని అన్నారు. మరుగుదొడ్ల మరమ్మతులు చేపడతామన్నారు. అలాగే ప్రతి గదిలో విద్యార్థులకు బెడ్‌లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ పనులన్నీ త్వరలోనే జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కరిమెరక నాగరాజు, జిల్లా నాయకుడు జుత్తిగ శ్రీనివాస్, కాగిత మహంకాళి తదితరులు పాల్గొన్నారు.

వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు



వారాహి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: మోళ్లపర్రు కనకదుర్గ బీచ్‌లో వేంచేసియున్న దశావతార సహిత మత్స్యనారాయణ స్వామి, అష్టలక్ష్మీ సమేత ఆదిలక్ష్మి అమ్మవార్ల ఆలయంలో వారాహి నవరాత్రుల కార్యక్రమం నిర్వహిస్తున్నారు. నిత్యార్చన పూజా కార్యక్రమంలో భాగంగా సోమవారం అమ్మవారి సన్నిధిలో నక్షత్ర శాంతి, దుష్టగ్రహ పీడన నివారణ కార్యసిద్ధికి నిత్యార్చన కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించే పూజకు నాడిగి రంగారావు, ఆముదాలపల్లి సుబ్రమణ్యం, సత్తినేని సర్వేశ్వరరావు, మేళం రంగనాథ్ దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

అంటువ్యాధుల నివారణపై అవగాహన



తరటావలో అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆకివీడు: అంటు వ్యాధులు ప్రబలడం వల్ల ప్రజలు అనారోగ్యం పాలై, ఆర్థికంగానూ, మానసికంగా ఇబ్బంది పడతారని వైద్యాధికారి ఎం.రమేష్ చెప్పారు. మండలంలోని తరటావ గ్రామంలో అంటువ్యాధుల నివారణ మాసోత్సవాల్లో భాగంగా సోమవారం అవగాహనా ర్యాలీని పెదకాపవరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ డెంగీ, డయేరియా, మలేరియా, ఫైలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు దోమల ద్వారా ప్రబలుతాయన్నారు. నిల్వ ఉన్న నీటిలో దోమలు లార్వాని వదిలి సంతతిని ఉత్పత్తి చేస్తాయన్నారు. ఇళ్ల ఆవరణల్లో నీటి నిల్వల్ని, మురుగు నీటి నిల్వల్ని తొలగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సంధ్యారాణి, హెల్త్ అసిస్టెంట్ దుర్గాప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పీ డి.మౌనిక, హెల్త్ అసిస్టెంట్ మధుప్రసాద్, అంగన్‌వాడీ కార్యకర్త భాను, ఆశా వర్కర్, స్థానికులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాబాయి దేశ్‌ముఖ్ జయంతి



భీమవరంలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ స్వాతంత్ర్య పోరాటంలో గాంధీజీతో కలిసి చురుగ్గా పాల్గొన్నారని ఇన్నర్‌వీల్ క్లబ్ ప్రాజెక్ట్ కన్వీనర్ గంధం శ్రీదేవి అన్నారు. జిల్లా సర్వోదయమండలి ఆధ్వర్యంలో పట్టణంలోని పొట్టిశ్రీరాములు మునిసిపల్ గరల్స్ హైస్కూల్లో సోమవారం దుర్గాబాయి దేశ్‌ముఖ్ జయంతిని నిర్వహించి ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దుర్గాబాయి దేశ్‌ముఖ్ తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో జన్మించారని, భారత రాజ్యాంగ సభలో ఆమె సభ్యురాలిగా ఉన్నారన్నారు. విద్యా శిక్షణ, నిరుపేద మహిళలు, పిల్లలు, వికలాంగుల కోసం నిరంతరం పాటుపడ్డారని కొనియాడారు. అనంతరం ఉపాధ్యాయులు గంధం శ్రీదేవి, కె.మాధవిలత, సునీత, వారణాసి రాధాకృష్ణలను అరసవల్లి చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో సత్కరించారు. సర్వోదయ మండలి కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, అరసవల్లి సుబ్రమణ్యం, కలిగొట్ల గోపాలశర్మ, నరహరిశెట్టి కృష్ణ పాల్గొన్నారు.

శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో..

సంఘ సంస్కర్త, రచయిత్రి దుర్గాబాయి దేశ్‌ముఖ్ జయంతి సందర్భంగా సోమవారం విజ్ఞాన వేదిక సేవా సంస్థ ఆధ్వర్యంలో 18వ వార్డులో పేద మహిళలకు వస్త్రాలు పంపిణీ చేశారు. దుర్గాబాయి దేశ్‌ముఖ్ చిత్రపటానికి త్యాగరాజ భక్తసభ నిర్వాహకుడు చెరుకువాడ వెంకట్రామయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భక్తిశ్రద్ధలతో వారాహి హోమం



వారాహి హోమం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం మెంటేవారితోటలోని శ్రీబాలాత్రిపుర సుందరీదేవి అమ్మవారి ఆలయంలో వారాహి నవరాత్రుల్లో భాగంగా సోమవారం వారాహి హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో యామిజాల కృష్ణ శర్మ, ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్‌లు అమ్మవారికి కుంకుమ పూజలు, పంచామృతాలతో అభిషేకాలను వేదమంత్రాలతో నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వారాహి నవరాత్రులు ముగింపు సందర్భంగా వేద మంత్రాలతో వారాహి హోమాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని, హోమాన్ని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అధ్వానంగా కోళ్లపర్రు రోడ్డు



గోతులమయంగా మారిన కోళ్లపర్రు ప్రధాన రహదారి

ఆకివీడు: మండలంలో మేజర్ పంచాయతీ కోళ్లపర్రు గ్రామంలోని ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. గ్రామంలోకి వెళ్లే రహదారి ప్రాంతానికి చేర్చి చేపల చెరువు గట్లు వేయడంతో ఆయా ప్రాంతాల్లో రోడ్డు ధ్వంసమవుతోంది. దుక్కి వర్షపు నీటికి రహదారిపై నీరు నిలిచిపోతోంది. వర్షపు నీరు, మురుగు నీరు బయటకు పోయేందుకు మార్గం లేక ముంపు నీటిలోనే వాహనాల రాకపోకలతో రోడ్డు మరింత అధ్వానంగా తయారైందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారికిరువైపులా కచ్చా డ్రెయిన్లు తవ్వించి, మురుగునీటిని మళ్లించేలా పంచాయతీ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. సిద్ధాపురం గ్రామం నుంచి రాజులపేట మీదుగా కోళ్లపర్రు గ్రామం నుంచి కలవపూడి–గణపవరం ప్రధాన రహదారికి అనుసంధానం అవుతోంది. దీంతో ఈ రహదారిపై చేపలు, రొయ్యల వ్యాన్లు, లారీలు, మేత లోడు లారీలు నిత్యం అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో రహదారి మరింతగా ధ్వంసమవుతోందని స్థానికులు వాపోతున్నారు. రానున్న రోజుల్లో వర్షాలకు రహదారి పూర్తిగా పాడై గుంతలతో నిండుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు తక్షణం స్పందించి కోళ్లపర్రు రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వానరాలతో బెంబేలు



స్థానిక వాసవీ మాత ఆలయం వద్ద వానరాలు

ఆకివీడు: ఆకివీడు, సమీప గ్రామాల్లో వానరాల సంచారం ఇటీవల పెరగడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు పది నుంచి 15 వరకు వానరాలు పట్టణంలోని దేవాలయాలు, ఇళ్లు, గోడలు, చెట్లపై మకాం వేస్తుండటంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించేందుకు స్థానికులు బెంబేలెత్తుతున్నారు. గత కొన్నాళ్లుగా వానర దండు పట్టణంలో, చెరుకుమిల్లి, కుప్పనపూడి ప్రాంతాల్లో కూడా సంచారం పెరిగింది. వీటి సంచారంతో జనం బెంబేలెత్తిపోతున్నారు.

పేరూరు ఘటనపై ప్రభుత్వం స్పందించాలి



నియామక పత్రాలు అందజేస్తున్న పుష్పరాజ్

భీమవరం: కడప జిల్లా ఒంటిమిట్ట మండలం పెన్న పేరూరు గ్రామంలో ఎస్సీ వర్గానికి చెందిన కదిరి ప్రభాకర్‌పై అగ్రవర్గ దురహంకారులు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ చెప్పారు. సోమవారం భీమవరంలో మాలమహానాడు ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. బంధువు మృతితో ఖనన కార్యక్రమానికి హాజరై తిరిగి ఇంటికి వెళుతున్న ప్రభాకర్ నీరసంతో కాసేపు విశ్రాంతి కోసం అగ్రవర్ణానికి చెందిన వ్యక్తి ఇంటి అరుగుపై కూర్చోవడంతో వేడినూనె వేసి గాయపర్చడమేగాక కులం పేరుతో దుర్భాషలాడిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, బాధితుడికి వైద్య నిమిత్తం ప్రభుత్వం స్పందించాలని పుష్పరాజ్ డిమాండ్ చేశారు. అనంతరం భీమవరం మండల మాలమహానాడు కార్యదర్శిగా సాదే ప్రసాద్, సహాయ కార్యదర్శిగా వర్ధనపు తేజను నియమిస్తూ నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నేతల సువర్ణ రాజు, తొర్లపాటి భాగ్యరాజ్, పిట్టా వినోద్ కుమార్, నల్లి రాజేష్ (మున్నా), చిగురుపాటి రాజేష్ పాల్గొన్నారు.

'మీ కోసం'లో మూడు ఫిర్యాదులు

ఆకివీడు: మీకోసం ప్రజా ఫిర్యాదుల విభాగానికి సోమవారం మూడు ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీఓ రామకృష్ణ చెప్పారు. జాతీయ రహదారి ప్రాంతంలోని అజ్జమూరు గరువు ప్రాంతంలోనూ మురుగునీరు రోడ్డు మీదకు చేరడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని, రోడ్డు గోతులమయంగా మారుతోందని, సమస్య పరిష్కరించాలని కోరారు. అదే విధంగా నగర పంచాయతీ పరిధిలోని మెయిన్ రోడ్డు, ఎస్‌బీఐ, జెడ్పీ హైస్కూల్ వరకూ జాతీయ రహదారి నీట మునిగి దుర్వాసన వెదజల్లుతోందని, ఆయా ప్రాంతాల్లో మురుగునీటి పారుదలకు చర్యలు తీసుకోవాలని వీఏఎస్ఎస్ ఆర్ మూర్తి ఫిర్యాదు అందజేసినట్లు చెప్పారు. స్థానిక గుమ్ములూరు సెంటర్‌లో షాపుల అద్దె విషయం, ఖాళీచేయకుండా ఇబ్బందులు పెడుతున్న సంఘటనపై జీ.ఆనందరాజు ఫిర్యాదు చేశారని ఎంపీడీఓ వివరించారు.

చెరువుపై ఆక్రమణలు తొలగించాలని వినతి

పాలకోడేరు: వేండ్ర గ్రామంలోని సంతమార్కెట్ వద్ద గల కొండాయ చెరువుపై ఆక్రమణలను తొలగించాలని కోరుతూ గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ అందజేశారు. చెరువు చుట్టుపక్కల వారు తమ ఇళ్లల్లో నుంచి మురుగునీరు, గృహాల్లోని వ్యర్థాలు వేస్తూ చెరువు నీటిని కలుషితం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో ఈ చెరువు నీటిని వ్యవసాయానికి సాగునీరుగా, పశువులకు తాగునీరుగా ఉపయోగించుకునే వారమని, ప్రస్తుతం చెరువు చుట్టుపక్కల చికెన్ దుకాణాలు ఏర్పాటు చేసుకుని చెరువులో వ్యర్థాలు వేస్తున్నారని ఆరోపించారు. వెంటనే చర్యలు తీసుకుని చెరువుపై ఆక్రమణలు తొలగించి, చెరువులో వ్యర్థాలు కలవకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శోభారాణి

పాలకొల్లు అర్బన్: నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడంలో విద్యార్థినులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి కోరారు. పట్టణంలోని డీఎన్నార్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం ప్రపంచ యువజన నైపుణ్యాల దినోత్సవం సందర్భంగా ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆన్‌లైన్ వ్యాస రచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి గెలుపొందిన విద్యార్థులను అభినందించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి జిల్లా అధికారి ఎ.కృష్ణారెడ్డి, అధ్యాపకులు ఆంజనేయులు, వీరభద్రం, మురళీకృష్ణ, ప్రేమ్‌కుమార్, విద్యార్థినులు పాల్గొన్నారు.

నేడు అవగాహన సదస్సు

పెనుగొండ: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం కెరీర్ గైడెన్స్ అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు పెనుగొండ మండల అధ్యక్ష కార్యదర్శులు డాక్టర ఎస్.విజయరాజు, షేక్ మస్తాన్‌లు తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ పెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాలలో మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ముఖ్య అతిథులుగా ఏపీ కెరియర్ గైడెన్స్ కన్వీనర్, మానవత విస్తరణ అధికారి డాక్టర్ కోడూరు రాధా పుష్పవతి, సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ కలిదిండి రామచంద్రరాజు పాల్గొంటారని తెలిపారు. ప్రతిభ కలిగిన విద్యార్థులకు డెస్క్‌టాప్ కంప్యూటర్, ప్రోత్సాహక బహుమతులు అందిస్తారన్నారు. విద్యార్థులు, మానవత కుటుంబ సభ్యులు పాల్గొనాలని కోరారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

పాలకొల్లు అర్బన్: ప్రజారోగ్యం కోసం ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక వైద్య శిబిరాలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని మెడికల్ ఆఫీసర్ డా.స్వరూప్ కోరారు. వెలివెల సచివాలయ కార్యాలయం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరంలో రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు అందజేశారు. వర్షాకాలంలో మంచినీరు కలుషితమవుతుందని, కాచి చల్లార్చిన నీటినే తాగాలని, వేడి ఆహార పదార్థాలు తినాలని సూచించారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీల్లో రోజువారీ ముగ్గు, బ్లీచింగ్ చల్లాలని కోరారు. మంచినీటి క్లోరినేషన్ పరీక్షలు నిర్వహించాలన్నారు. సర్పంచ్ కందుల వెంకటేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీ శైలజ, ఏఎన్ఎం లలితకుమారి, హెల్త్ సూపర్‌వైజర్ కమల పాల్గొన్నారు.

జలదిగ్బంధంలో రామలింగేశ్వరుడు



రామలింగేశ్వరస్వామి ఆలయంలోకి చేరిన నీరు

పెనుమంట్ర: పెనుమంట్ర మండలంలోని గోస్తనీ డ్రెయిన్ పొంగి ప్రవహిస్తుండటంతో నత్తారామేశ్వరంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయం జల దిగ్బంధంలో చిక్కుకుంది. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి జలాలను గోస్తనీ పంట కాలువ ద్వారా వేల్పూరు వద్ద గోస్తనీ డ్రెయిన్‌లోకి మళ్లించడంతో ఈ ముంపు సమస్య మరింత ఎక్కువయ్యింది. గోస్తనీ డ్రెయిన్‌లో కిక్కిస చెత్త పేరుకుపోవడంతో దిగువకు మురుగు నీరు ప్రవహించకపోవడంతో పెనుమంట్ర మండలంలోని నాట్లు వేసిన వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. అంతే కాకుండా పుణ్యక్షేత్రాల ఆవరణలో కూడా నీరు నిలిచిపోవడంతో స్వామివారి నిత్య పూజలకు కొంత అంతరాయం ఏర్పడుతుంది.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

పెనుగొండ: స్కోజో ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెనుగొండ పంచాయతీలో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ తెలిపారు. వైద్య శిబిరం ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. అందరికీ ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. అవసరమైన వారికి ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ద్వారా ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తారన్నారు. వైద్య శిబిరాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో కార్యదర్శి టి.రత్నాకర రావు పాల్గొన్నారు.